క్లుప్తంగా

నీటి వనరుల వినియోగంపై అవగాహన

దొనకొండ: మండలంలోని చందవరంలో రిలయన్స్ ఫౌండేషన్ ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు నీటి వనరుల వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. గ్రామంలోని నీటి వనరులు ఏ విధంగా ఉపయోగించుకునే విధానం, గ్రామంలోని సమస్యలను ప్రజలు కలిసికట్టుగా పరిష్కరించుకోవాలని ఎఫర్ట్ సంస్థ వివరించింది. మీ గ్రామం మీరే శుభ్రంగా ఉంచుకోవాలని, దానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాధ్యత వహించాలని ఎఫర్ట్ సంస్థ టీమ్ ప్రతినిధి జెస్సీగ్లోరీ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని అనుమలవీడు సచివాలయం పరిధి పాలకవీడు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొంటారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరాటేలో స్ప్రింగ్ బోర్డు విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు రూరల్: కర్నూల్‌లో గత ఆదివారం జరిగిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో స్ప్రింగ్ బోర్డు విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పథకాలు అందుకున్నారని స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ జేవీ నారాయణ గురువారం తెలిపారు. మాన్విత్, కార్తీ, విరాట్, హన్సిస్, గౌతమ్, అర్జున్‌లు ఉత్తమ ప్రదర్శన చూపి బంగారు పథకాలు సాధించారు. 8 మంది విద్యార్థులు రజిత పథకాలు, ఇద్దరు విద్యార్థులు కాంస్య పథకాలు సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ షాషావలిని స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆయనపై చర్యలు తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయ్ నిధి స్టాలిన్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపి నాయకులు గురువారం స్థానిక సీఐ దేవప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు వెంకటరామాంజనేయులు, చంద్రమోహన్, నూకల శ్రీనివాసులు, మారుతీ ప్రసాద్, పాల్గొన్నారు.

ఎరువుల గోదాములు ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె, చట్టిరెడ్డిపల్లె గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, ఎరువుల గోదాములను స్థానిక వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాముల్లోని ఎరువు బస్తాల స్టాకును పరిశీలించారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 8250 ఎకరాలు సాగు చేయగా 6280 ఎకరాలు ఈ-క్రాప్ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు కూడా ఈ-క్రాప్ చేయించుకోవాలని కోరారు. వారికి ఈ నెల 15వ తేదీ వరకు సమయం ఉంటుందన్నారు. రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగుల సమస్యలపై స్పందించాలి

కొనకనమిట్ల: దివ్యాంగులకు ఏదైనా అన్యాయం జరిగినప్పుడు స్పందించి వారికి తగిన న్యాయం చేయాలని ఎస్సై బ్రహ్మనాయుడును మండల వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు నుసుం బాలచంద్రుడు కోరారు. ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు చేటపట్టిన బ్రహ్మనాయుడును గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2016-హక్కుల చట్టంలోని సెక్షన్ 92(ఏ)పై చర్చించి దివ్యాంగులకు న్యాయపరమైన అంశాల్లో సహకరించాలని విజ్ఞప్తి చేయగా ఎస్సై సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న సిబ్బంది

కంభం: తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు కె.ప్రభాకర్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న నేపథ్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అవార్డులు గురుతర బాధ్యతను పెంచుతాయని అవార్డు గ్రహీత అన్నారు. పూలమాలలు, పార్కువీధి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న రహమత్‌ను పాఠశాల కమిటీ, ప్రధానోపాధ్యాయుడు రసూల్‌బేగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

రైతులు జీవన ఎరువులు వాడాలి



తెల్లబాడులో జీవన ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న అన్నపూర్ణ

దొనకొండ: గ్రామాల్లోని రైతులు పంట పొలాలకు రసాయనిక ఎరువులను తగ్గించి జీవన ఎరువులు ఎక్కువగా వినియోగించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వనరుల కేంద్రం అధికారి డి.అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని తెల్లబాడులోని బ్రహ్మారెడ్డి రైతు మిర్చి పంటకు మైకోరైజావేమ్ అనే జీవన ఎరువును మగ్గిన పశువుల ఎరువులతో కలిపి వాడే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. జీవన ఎరువులు వాడితే అధిక దిగుబడి పొందొచ్చన్నారు. సూక్ష్మ పోషకాలైన జింక్, మాంగనీస్, ఐరన్, కాపర్ మొదలైన వాటిని కూడా పంట పొలాలకు ఉపయోగించ వచ్చన్నారు. మండలంలో ముగ్గురు రైతులు జీవన ఎరువులు వాడి అధిక దిగుబడులు పొందారని తెలిపారు. వ్యవసాయాధికారులు లక్ష్మీ నారాయణ, శేషమ్మ, వ్యవసాయ సహాయకులు మురళి,గ్రామ రైతులు పాల్గొన్నారు.

రుణాలతో జీవనాభివృద్ధి పొందాలి

దొనకొండ: బ్యాంకుల్లో రుణాలు పొంది మహిళలు జీవనాభివృద్ధి పొందాలని, వారి కాళ్లపై వాళ్లు నిలబడాలని పశు వైద్యాధికారి కరిష్మ అన్నారు. మండలంలోని ఆరవల్లిపాడులో మహిళలకు రుణ మేళా-జగనన్న పాల వెల్లువ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళకు రుణమేళా కార్యక్రమం కింద గేదెలు కొనుగోలు చేసేందుకు తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా పొందిన రుణాలతో గేదెలు కొనుగోలు చేసి మళ్లీ రుణాలు పొందాలన్నారు. జగనన్న పాల వెల్లువ సెంటర్‌కు పాలు పోసిన ప్రతి పాడి రైతుకు ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు తప్పకుండా ఇస్తామని మేనేజర్ వివరించారు. ఏపీఎం జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డైరీ యూనిట్లకు 35 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ బాపనపల్లి మంగమ్మ శ్రీను, ఎంపీటీసీ కమ్మ నారాయణ, పాల వెల్లువ రూట్ అధికారి డి.బాలయ్య, వెటర్నరీ అసిస్టెంట్ భూలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: సేంద్రియ విధానంలో సాగు చేసే మిర్చి పంటలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా డీపీఎం సుహాసిని పేర్కొన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసే పంటలను ఆమె గురువారం పరిశీలించారు. చిన్నదోర్నాలలో జంకె మల్లికార్జునరెడ్డి అనే రైతు సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరల పంట, నలబోతుల ఆంజనేయులు అనే రైతు సాగు చేస్తున్న పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే మిరపకాయలను మార్కెట్ ధర కన్నా ఎక్కువ ఆదాయం వచ్చే పద్ధతులను రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్, ఏపీసీఎన్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి కరిష్మ



పండ్ల తోటలను పరిశీలిస్తున్న డీపీఎం సుహాసిని

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

● ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

రాచర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగుతోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని అనుమలవీడు సచివాలయం పరిధి ఓబుల్‌రెడ్డిపల్లె, అనుమలవీడు గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. సొంతిళ్లు లేని నిరుపేదలు ఉండరాదనే ఉద్దేశంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడమే కాకుండా నీటి వసతి, విద్యుత్, ఇంటింటికీ కొళాయి, సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన ద్వారా దేశ చరిత్రలోనే తొలిసారిగా విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుపేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే అర్హులైన పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజు మొత్తం క్రమం తప్పకుండా నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతేగాక పేద విద్యార్థులకు జగనన్న వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుకతో పాటు మనబడి నాడు-నేడు పథకం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపు రేఖలు మార్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే అన్నా రాంబాబు వివరించారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, పాలకవీడు సర్పంచ్ షేక్ పల్నాటి లతీఫ్, మాజీ సర్పంచ్ కొర్విపాటి నాయబ్ రసూల్, మాజీ ఎంపీటీసీ చప్పిడి శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఇబ్రాహీం, పగడాల శ్రీరంగం, సూర పాండుంగారెడ్డి, సూర రామ్మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వేల్పుల గోపాల్, రామరాజు, ఎంపీడీవో కె.కవితా చౌదరి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర నాయక్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



గొట్లగట్టులో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



ప్రత్యేక అలంకారంలో సత్యభామ శ్రీకృష్ణులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని వివిధ పాఠశాలల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టులో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. చిన్నారులను కృష్ణుడు, గోపికల రూపంలో ముస్తాబు చేసి, వెన్న ముద్దలు పెట్టి ఆటలాడించారు.

కమనీయం రుక్మిణీ కల్యాణం

తర్లుపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు రమణాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారిని సుందరంగా అలంకరించి పూజలు చేశారు. రుక్మిణీ కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్త జె విజయభాస్కరరావు, ఎస్.కార్తీక్, భవనం రామకృష్ణారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

గిద్దలూరు రూరల్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలోని మూలవిరాట్ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ఉట్టి కొడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలోని వేణుగోపాలస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దదోర్నాల: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఇస్కాన్ మండల ప్రతినిధి నిమయ్‌దాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఉట్టి మహోత్సవంలో చిన్నారులు, యువకులు భారీగా పాల్గొని ఉట్టి మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలతో భక్తులను అలరించారు. ఆలయ కమిటీ భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంది. తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు గుమ్మా యల్లేష్, ఆలయ అర్చకులు సుదర్శనాచార్యులు పాల్గొన్నారు. ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ మండల నాయకులు గుమ్మా యల్లేష్ పర్యవేక్షించారు.

కృష్ణాష్టమి వేడుకల్లో బూచేపల్లి

దర్శి: మండలంలోని చలివేంద్ర గ్రామం వద్ద శ్రీ వెంకటాచలం క్షేత్రంలో జరిగిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. అనంతరం వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు ఉట్టికొట్టి విద్యార్థులు, భక్తులను ఉత్సాహపరిచారు. వారిని దుశ్శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో అంకాలమ్మ దేవాలయం వద్ద శ్రీసనాతన భగద్గీత ఆశ్రమంలో శ్రీశివసత్యానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యభామ సమేత శ్రీకృష్ణునికి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ అల్లు పెద్దఅంకిరెడ్డి, గొట్టం పుల్లారెడ్డి, బత్తుల దిబ్బయ్య, ఆవులరాజు, గొట్టం ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



మార్కాపురంలోని ఓ స్కూల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



తర్లుపాడులో రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్సాహంగా ఉట్టి కొట్టే పోటీలు

మార్కాపురం: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్పీ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పట్టణంలో ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. ముందుగా శ్రీ కృష్ణుడి విగ్రహానికి పూజల అనంతరం ఉట్టి కొట్టే పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పిన్నిక చక్రపాణి యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన పోలేరమ్మ విగ్రహం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ దంపతులు

మార్కాపురం రూరల్: మండలంలోని కొండేపల్లిలో పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, యంత్రానుష్ఠానం తదితర పూజలు, హోమాలు నిర్వహించి, మధ్యాహ్నం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, సతీమణి కల్పన, సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కుందురు వెంకటరెడ్డి, కొలగట్ల వెంకటరెడ్డి, గంటా చిన్న వెంకటేశ్వరరెడ్డి, శింగా లక్ష్మీరెడ్డి, కుందురు విష్ణువర్ధన్‌రెడ్డి, దొండేటి వెంకటరెడ్డి, గంట వెంకట ముసలారెడ్డి, కొలగట్ల శివారెడ్డి తదితరులు పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి ఘన స్వాగతం పలికారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అవసరం

మార్కాపురం: విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అవసరమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ప్రజా సైన్సు వేదిక ఇన్‌చార్జి డాక్టర్ సీపీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఇందిరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను, వ్యక్తిత్వాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని, అప్పుడే మానసిక పరిపక్వతతోపాటు గుడ్ మానరిజం వస్తుందన్నారు. ప్రస్తుత ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ కచ్చితంగా ఉండాలన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, డిప్లమో ఇన్‌చార్జి అబ్దుల్ కలాం, హెచ్ఓడీలు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సాయిబాబా, నసీమ, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



సీపీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి

ముండ్లమూరు: మండలంలో పెండింగ్ విద్యుత్ బకాయిల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్ శాఖ ఏడీఈ కె.పిచ్చయ్య అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిబ్బందితో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, ప్రభుత్వ కార్యాలయాలు, గృహవినియోగదారుల నుంచి రూ. 70 లక్షల పెండింగ్ బిల్లులు వసూలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. వర్షాల సమయంలో వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్య తలెత్తినా వెంటనే సిబ్బంది స్పందించాలన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏఈ ఇమ్మానియేలుబాబు, ఎల్ఐ సాంబయ్య, సిబ్బంది ఆంజనేయులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఈ పిచ్చయ్య

పాడి రైతులకు రుణాలు

ముండ్లమూరు: అమూల్ పాలకేంద్రాలకు పాలు పోసే రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్లు పీడీసీసీ బ్యాంకు మేనేజర్ యోగేశ్వరరావు అన్నారు. మండలంలోని జమ్మలమడకలో గురువారం జగనన్న పాలవెల్లువ రుణ మేళ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ కేంద్రాలకు పాలుపోసే రైతులకు లక్ష నుంచి రెండు లక్షల వరకు బ్యాంకు రుణం మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. గేదెల కొనుగోలుకు, వాటి నిర్వహణ కోసం రెండు రకాల రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆశక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ హనుమంతరావు, పశువైద్యాధికారి కాశిరెడ్డి, ఏపీఎం హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మార్కాపురం టౌన్: మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించిందని 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత పేర్కొన్నారు. గురువారం పూలసుబ్బయ్య కాలనీలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మహోత్సవ్ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని పౌష్టికాహారాన్ని అందించారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పాలు, కోడిగుడ్లు, ఇతర పోషకాహార పదార్థాలు అందిస్తోందన్నారు. తలిదండ్రులు తమ పిల్లలను ఐసీడీఎస్ కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవికుమారి, సిబ్బంది భాగ్యలక్ష్మి, అంకమ్మ, మంత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలిపై అదే గ్రామానికి చెందిన షేక్ సైదావలి, అతని భార్య ఆదాంబీలు దాడి చేసి గాయపరిచారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. షేక్ మస్తాన్‌వలి, సైదావలి అన్నదమ్ములు. వారి మధ్య తండ్రి ద్విచక్ర వాహనం విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి మస్తాన్‌వలిపై సైదావలి, ఆదాంబీ, మరికొందరు కర్రలతో దాడి చేశారు. క్షతగాత్రులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వైద్యశాల నుంచి వచ్చిన రిపోర్టు మేరకు దాడి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నీటి కోసం రాస్తారోకో

పొదిలి: నీటి సమస్య పరిష్కారం చేయాలంటూ బాప్టిస్ట్‌పాలెం వాసులు గురువారం సాయంత్రం ఒంగోలు రోడ్డులోని దర్గా వద్ద రాస్తారోకో చేపట్టారు. అధికారులు పట్టించుకోవటం లేదంటూ మహిళలు నిరసన తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలకు సర్దిచెప్పారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌కు మార్గం చూపారు. అనంతరం వాహనాల రాకపోకలకు పునరుద్ధరించారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి

పుల్లలచెరువు: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు ఇందిర ప్రసాద్, శామ్యూల్‌జాన్ అన్నారు. ఎర్రపాలెం పాఠశాలను శామ్యూల్ జాన్, నరజాముల ఎస్సీ కాలనీ పాఠశాలను ఇందిర ప్రసాద్‌లు గురువారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు రోజూ లెసన్ ప్లాన్స్ రాయాలన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పాలి



మౌలాలీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మౌలాలిని పట్టణంలోని తన నివాసంలో సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత వార్డెన్ నజీర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్షావలి, పట్టణ వైఎస్సార్ సీపీ ప్రచార కార్యదర్శి మయూరి కాశీం పాల్గొన్నారు.

సీపీఎం పాదయాత్ర కరపత్రం ఆవిష్కరణ

దర్శి: సీపీఎం పాదయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు విడుదల చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రజల సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా దొనకొండ నుంచి ఒంగోలు వరకు ఈ నెల 10వ తేదీ నుంచి పాదయాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం దర్శి మండల కమిటీ నాయకుల సందు వెంకటేశ్వర్లు, కేవీ పిచ్చయ్య, ఉప్పు నారాయణ, నాగరాజు, ఆదినారాయణ, వెంకట్రావు పాల్గొన్నారు.